www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 29 జూన్ 2023

5

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

తాగునీటి పైప్‌లైన్ల పునరుద్ధరణ : మంత్రి వేణు

ప్రజాశక్తి-రామచంద్రపురం

పురపాలక సంఘంలో అన్ని మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా వివిధ అభివద్ధి పనులు చేపట్టనున్నట్లు మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకష్ణ అన్నారు. బుధవారం రామచంద్రపురం పురపాలక సంఘం సాధారణ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం అమత్ పథకం 2.0 నిధులతో పురపాలక సంఘం నిధులు రూ.12 కోట్ల 50 లక్షలతో పట్టణంలోని పాత మంచినీటి పైపులైన్లను తొలగించి కొత్త లైన్లు మారుస్తామన్నారు. ఇతర ప్రాంతాల్లో పైపులు వేయడంతోపాటు, ఇంటింటికీ తాగునీరందించే విధంగా ఈ నిధులు వెచ్చిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు రూ.16 కోట్ల 50 లక్షలతో అంతర్గత మురికి కాలువలు నిర్మిస్తామని మంత్రి తెలిపారు. రూ.3 కోట్లతో పట్టణంలోని మురికినీటి శుద్ధి చేసే ప్లాంటు ఏర్పాటుచేయనున్నట్లు తెలియ చేశారు.

భవిత కేంద్రాలకేదీ భద్రత..

- పాఠశాలల ఆస్తులకు రక్షణ నిల్
- బీటలు తీసిన గోడలు
- ఆకతాయిల సంచారం

మండపేటలోని భవిత కేంద్రం

ప్రజాశక్తి-మండపేట

ప్రత్యేక అవసరాల చిన్నారుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో భాగంగా ప్రభుత్వం మండలానికి ఒకటి చొప్పున ఉమ్మడి జిల్లాలో 64 భవిత కేంద్రాలను ఏర్పాటు చేసింది. అవి అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 22 మండలాల్లో 22 కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో అంధత్వం, చెవిటి, మూగ, మానసిక వైకల్యం, నాడీ సంబంధిత వైకల్యం తదితర విద్యార్థులు లైఫ్‌సిల్క్స్, స్పీచ్‌థెరపీ, బ్రైన్ లాంగ్వేజ్, లిప్ రీడింగ్, ఐడెంటిఫికేషన్, రైటింగ్ స్కిల్స్ తదితర విద్యను అందిస్తుంటారు. వీరికి సంవత్సరానికి ఒకసారి ట్రై సైకిల్, హియరింగ్ ఎడ్, రోలెటర్, క్లచ్చర్స్, వాకింగ్ స్టిక్, కళ్ల జోళ్లు, ఎంఆర్ కిట్లు తది తర ఉపకరణాలతో పాటు అందరి విద్యార్థులకు ట్రాన్స్‌పోర్టు అలవెన్స్ రూ.300 విజువల్ ఇంపైర్డ్, అంగవైకల్యం ఎస్కార్ట్ రూ.300, గర్ల్స్ స్టైపెన్స్ 6 తరగతి నుంచి 10వ తరగతి వరకు రూ.200, రీడింగ్ రూ.200, హోం బేసిడ్ రూ.200 అలవెన్స్‌లను ప్రభుత్వం నెలకోసారి అందిస్తుంది. ఇవే కాక ఫిజియోథెరపీ డాక్టర్ వారానికి ఒకసారి వీరికి ప్రత్యేక సేవలందిస్తూ ఉంటారు.

ఈ కేంద్రాల్లో పని చేసే సహిత విద్యా ఉపాధ్యాయులు కొందరు 2019లో స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులకు వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ చేపట్టకపోవడంతో జిల్లాలో 44 మంది ఉండగా 30 మాత్రమే ఉండగా 14 ఖాళీలు ఉన్నాయి. అంతేకాక 7 మండలాల్లో మాత్రమే ఫిజియోథెరపీ సేవలు నిరంతరాయంగా అందు తున్నాయి. స్పీచ్‌థెరఫీ, సైకాలజిస్టు ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేయాల్సి ఉంది.

బీటలు తీసిన గోడలతో ఆందోళన

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న భవిత కేంద్రంలో విద్యార్థులు ఎక్కి వెళ్ళేందుకు ఏర్పాటు చేసిన రెయిలింగ్ ట్రాక్‌కు ఒక పక్క రెయిలింగ్ చోరీకి గురయ్యింది. విద్యుత్ స్విచ్‌బోర్డులు, తలుపులు మరమ్మతులకు గురి కావడంతో పాటు బీటలు తీసి ప్రమాదాలకు నిలయంగా ఉన్న గోడలతో విద్యార్థుల తల్లిదండ్రులు ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. అంతేకాక అంగవైకల్యం ఉన్న విద్యార్థులు వాక్‌కు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రోలేటర్ మూలకు చేరింది.

పాఠశాల ఆస్తులకు రక్షణ కరువు

ఈ కేంద్రం చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడంతో ఇక్కడి ఆస్తులకు రక్షణ లేకుండా పోయింది. ఇటీవల కాలంలో వాటర్ మోటర్ చోరీకి గురి కావడంతో విద్యార్థుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని విద్యార్థిని తండ్రి ఒకరు సొంత నగదుతో కొత్త మోటర్ కొన్నారు. అంతేకాక వరుసగా రెండు రోజుల పాటు కేంద్రానికి సెలవు వస్తే మందు మద్యం బాటిళ్లతో ఆవరణం అంతా అస్తవ్యస్తంగా మారుతోందని, ప్రతి రోజూ ఏదో ఒక గృహోపకరణాన్ని పాడు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిలిచిన మెయింటెనెన్స్ గ్రాంట్

కేంద్రం అభివృద్ధి కోసం ప్రభుత్వం ఏడాదికి రూ.10,000 గ్రాంటును అందిస్తుండగా కరోనా సమయం నుంచి అది నిలిచిపోయింది. ఈ విషయంపై జిల్లా సహిత విద్యా సమన్వయకర్త ఎంవివిఎస్ నారాయణను ఉపాధ్యాయుల ఖాళీలను, మెయింటెనెన్స్‌లను ప్రభుత్వానికి నివేదించామన్నారు.

ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలి

బహుళ వైకల్యం కారణంగా మా బాబును భవిత కేంద్రంలో చేర్పించాను. ప్రతిరోజూ ఇంటి నుండి కేంద్రానికి తీసుకెళ్లి తీసుకువస్తుంటాను. ఇటీవల కాలంలో కేంద్రంలోని వాటర్ మోటర్ చోరీకి గురికావడంతో విద్యార్థుల ఇబ్బందుల దృష్టా కొత్త మోటారు కొన్నాను. అంతేకాక వరుసగా రెండు రోజుల పాటు కేంద్రానికి సెలవు వస్తే మద్యం బాటిళ్లతో అస్తవ్యస్తంగా మారడంతో ఏదో ఒక గృహోపకరణాన్ని పాడు చేస్తున్నారు.

- ఇ.శ్రీనివాసు, విద్యార్థి తండ్రి, కేశవరం.

కేంద్రానికి మరమ్మతులు చేయాలి

పుట్టుక నుంచే మా అబ్బాయి బహుళ వైకల్యంతో బాధ పడుతున్నాడు. చిన్నారిలో మార్పు కోసం ఈ భవిత సెంటర్‌లో నాలుగు సంవత్సరాల క్రితం చేర్పించాము. విద్యార్థులు ఎక్కి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన రెయిలింగ్ ట్రాక్‌కు ఒక పక్క రెయిలింగ్ చోరీకి గురయ్యింది. స్విచ్ బోర్డులు, తలుపులు, బీటలు తీసిన గోడలకు అధికారులు మరమ్మత్తులు చేపట్టాలి.

- సిహెచ్.గనికమ్మ, విద్యార్థి తల్లి, మారేడుబాక.

అమ్మ ఒడితో పేద పిల్లలకు చదువులు

ప్రజాశక్తి-అమలాపురం

పేద కుటుంబాల్లోని ఉన్నత చదువులు చదువుకోవాలనే సమున్నత లక్ష్యంతో అమ్మఒడి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. బుధవారం పార్వతీపురం జిల్లా కురుపాం నుంచి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి నాలుగో విడత వరుసగా 2022-23 విద్యా సంవత్సరం సంబంధించి అమ్మఒడి నిధులను వర్చువల్ విధానంలో బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాకు జమ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్షరాస్యత శాతాన్ని పెంచి పేదలకు నాణ్యమైన విద్యను ఉచితంగా అందించాలనే సంకల్పంతో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నవరత్నాలు పథకాలలో అమ్మ ఒడి పథకం ఒకటని చెప్పారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలు బడికి ఆకర్షితులయ్యే విధంగా మనబడి నాడు-నేడు కార్యక్రమాలను శరవేగంగా జరుగుతున్నాయన్నారు. బడుగు బలహీన వర్గాల్లో అక్షరాస్యతా శాతాన్ని పెంచేందుకు పలు పథకాలు విద్యావ్యవస్థలో అమలు చేస్తామన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని 22 మండలాల పరిధిలో లక్ష 38 వేల 883 తల్లుల ఖాతాలకు రూ.208 కోట్ల 24 లక్షల 95 వేలు జమ చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఒకటో తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులకు అమ్మ ఒడి లబ్ధిని రాష్ట్ర ప్రభుత్వం చేకూర్చిందన్నారు. అమ్మ ఒడి పథకం ద్వారా దారిద్య రేఖకు దిగువన ఉన్న విద్యార్థుల తల్లులు, సంరక్షకులకు బ్యాంకు ఖాతాలో ఈ జమ చేస్తారన్నారు. ఎంఎల్‌సి కె.సూర్యనారాయణరావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్ పలు విప్లవాత్మకమైన సంస్కరణలతో ముందుకు సాగుతున్నారన్నారు. పేద విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దుకుంటూ ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్ష అన్నారు. ఈ కార్యక్రమంలో పి.గన్నవరం ఎంఎల్‌ఎ కె.చిట్టిబాబు, స్థానిక పురపాలక సంఘం చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, వక్స్ బోర్డ్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ ఖాదర్, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్తిబాబు, జడ్పిటిసి శ్రీహరి, డిఇఒ ఎం.కమల కుమారి, విద్యాశాఖ సిబ్బంది విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్

పాదయాత్రలో పాల్గొన్న వెంకటేశ్వరరావు

పోలవరం యాత్రకు అపూర్వ స్పందన

ప్రజాశక్తి-అమలాపురం

2013 చట్టం ప్రకారం పునరవాసం, పరిహారం చెల్లించాల్సిందే పోలవరం పోరుకేక మహాపాదయాత్రకు అపూర్వ స్పందన ఉందని సిపిఎం అంబేద్కర్ కోనసీమ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు అన్నారు. పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పునరావాసం, పరిహారం చెల్లించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన పోలవరం నిర్వాసితుల పోరుకేక పాదయాత్ర జీలుగుమిల్లి మండలం లో కొనసాగింది. బుధవారం ఈ పాదయాత్రలో కారెం వెంకటేశ్వరరావు జిలా కమిటీ సభ్యులు జి.దుర్గా ప్రసాద్, ఎన్.బలరాం, పీతల రామచంద్రరావు, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తాడి శ్రీరామ్మూర్తి, సిఐటియు నాయకులు టి.మోహనరావు, సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ తరపున పాదయాత్ర జయప్రదానికి కొంత ఆర్థిక సహకారాన్ని రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకి అందించారు.

శ్యామ్ కుటుంబానికి సాయం

కాట్రేనికోన: శ్యామ్ మణికంఠ మృతి చెందటం చాలా బాధాకరమని ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ అధ్యక్షులు రాయడు బాబ్జి విచారం వ్యక్తం చేశారు. మణికంఠ కుటుంబ సభ్యులను పరామర్శించి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మణికంఠ కుటుంబ సభ్యులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఫ్యాన్స్ తరుపున శ్యామ్ మణికంఠ కుటుంబ సభ్యులకు రూ.50 వేల సాయం అందించారు.

దుర్గారావుకు మంత్రి అభినందన

ఉప్పలగుప్తం : వైసిపి సేవాదళ్ మండల కన్వీనర్‌గా నియమితులైన గొల్లవిల్లి పంచాయితీ వాడపర్రుకు చెందిన చప్పిడి దుర్గారావును రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అభినందించారు. మంత్రి విశ్వరూప్‌ను కన్వీనర్ దుర్గారావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కడిమి చిన్నవరాజు, సర్పంచ్‌లు జొన్నాడ శ్రీదుర్గ, యర్రంశెట్టి రామచంద్రరావు, ఉప సర్పంచ్ మారిశెట్టి దుర్గారావు, మారిశెట్టి పుండరీకాక్షుడు, దోనిపాటి రమా వెంకటరమణ, వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు బడుగు గణేష్ అభినందించారు.

ప్రజారోగ్యమే గ్లోబల్ ఫౌండేషన్ లక్ష్యం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

ప్రజలంతా ఆరోగ్యంగా జీవించడమే అడాప్ట్ ఏ గ్లోబల్ ఫౌండేషన్ విలేజ్ లక్ష్యమని ఫౌండేషన్ కో ఆర్డినేటర్ నడింపల్లి వెంకట రామరాజు (రాంబాబు) తెలిపారు. బుధవారం అమలాపురం రూరల్ మండలం వన్నె చింతలపూడి క్షత్రియ సేవా సమితి (క్లబ్) కమ్యూనిటీ హాల్లో జరిగిన సమావేశంలో కిడ్నీ, లివర్, పక్షవాతం, టి.బి. వ్యాధులతో బాధపడుతున్న ఐదు కుటుంబాల వారికి ఆయన ఫౌండేషన్ తరపున రూ.2 లక్షల 10 వేల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ గ్రామంలో ప్రజలంతా ఆరోగ్యంగా ఉండేలా తమ ఫౌండేషన్ కృషి చేస్తోందన్నారు. అనారోగ్యంతో బాధపడే వారికి అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్క రాజా రత్న నాగవాణి, ఎంపిటిసి సభ్యురాలు పి.నాగమణి, క్షత్రియ సేవా సమితి సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు అందజేస్తున్న రాంబాబు

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు

ఆత్రేయపురం : శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ బి వై కిరణ్ కుమార్ అన్నారు. ఆత్రేయపురం స్టేషన్ ఎస్ఐగా ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు ఈయన భీమవరం నుండి ఇక్కడకు బదిలీపై వచ్చారు ఇప్పటివరకు ఎక్కడ పని చేసిన ఎస్ఐ సిహెచ్ సుధాకర్ అమలాపురం ఎస్పి ఆఫీసుకి విఆర్‌పై వెళ్లారు.

శివారు ప్రాంత ప్రజలందరికీ తాగునీరు

ప్రజాశక్తి-కాట్రేనికోన

గ్రామీణ ప్రాంతాల ప్రజలందరికీ తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ముమ్మిడివరం ఎంఎల్‌ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని పల్లంకుర్రు పంచాయతీ పరిధిలో జలజీవన మిషన్, సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన పలు ఓవర్ హెడ్ స్టోరేజ్ ట్యాంకుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా పల్లంకుర్రు పంచాయతి పరిధిలో పెదపేట, సాపేవారి పేట, కొత్తఆది ఆంధ్రపేట, మొక్కలతిప్ప, జై భీమ్ నగర్, మచ్చావారి పేటలో నిర్మించిన 5 వాటర్ ట్యాంక్‌లను గురువారం ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పాలేపు లక్ష్మీ ధర్మారావు, జెడ్‌పిటిసి నేల కిషోర్ కుమార్, వైసిపి మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి, వైస్ ఎంపిపి సానబోయిన నాగేశ్వరరావు, స్థానిక సర్పంచ్ నాతి అలివేణి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాశి హనుమంతరావు, సొసైటీ అధ్యక్షులు యేడిద సుబ్బారావు, జగడం బాలయోగి, నడింపల్లి కృష్ణంరాజు, ఆర్‌బికె చైర్మన్ నాతి సత్యనారాయణ, ఎంపిటిసి గిడ్డి తిరుపతి వెంకటేశ్వర రావు, సర్పంచ్‌లు చల్లగల వెంకట లక్ష్మి అప్పారావు, గెద్దాడి ఈశ్వరి వెంకటేశ్వర రావు, ఇసుకపట్ల శ్రీనుబాబు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

చట్టాలను ఉల్లంఘించిన మన వారికి 'లా బ్రేక్ నేస్తం' పెట్టాలంటున్నారు సార్..!!

ఉపా చట్టాన్ని రద్దు చేయాలని ప్రదర్శన

ప్రజాశక్తి-రామచంద్రపురం

146 మందిపై తెలంగాణ ములుగు జిల్లా పోలీసులు బనాయించిన తాడ్వాయి ఊపా కుట్ర కేసును ఎత్తివేయాలని కోరుతూ సిపిఐ, సిపిఎం, న్యూ డెమోక్రసీ పార్టీలు, ప్రజాసంఘాలు బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఐ టౌన్ కార్యదర్శి పి.రాము, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు బి.సిద్ధూ, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటేశ్వర రావు, అరుణోదయ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి వి.భీమశంకర్ తదితరులు మాట్లాడారు. ప్రగతిశీల మహిళ సంఘం జాతీయ కన్వీనర్ వి.సంధ్య, అరుణోదయ విమలక్క, సుధా భరద్వాజ్, ప్రొఫెసర్ కాశీం పౌరహక్కులు, మానవ హక్కులుకోసం, మహిళా హక్కుల కోసం కషి చేస్తున్న 152 మందిపై కుట్రపూరితంగా ఊపా దేశ ద్రోహ కేసులు బనాయించారన్నారు. ములుగు పోలీసులు కేసులో అత్యుత్సాహం ప్రదర్శించారన్నారు. 2019లో చనిపోయిన బొంబాయి హైకోర్టు జడ్జి సురేష్, 2021లో కరోనా కారణంగా చనిపోయిన అమరవీరుల బంధు మిత్రుల సంఘం నేత నరసయ్యపై కూడా దేశ ద్రోహ కేసులు నమోదు చేశారన్నారు. చనిపోయిన, జైల్లో ఉన్నవారిపై కూడా ఈ అక్రమ కుట్ర కేసులు నమోదు చేశారన్నారు. దేశంలో అమాయకులపై దేశ ద్రోహ, రాజ్య ద్రోహ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ఈ నిరసనలో సిపిఐ నాయకులు ఎం.ప్రేమానందం, బాబ్జి, అంబటి కృష్ణ, గాలింకి చిట్టి బాబు, ఎం.రాజు, రామకష్ణ, పట్టాభి, చిన్నారావు, రామిరెడ్డి పాల్గొన్నారు

పట్టణ పరిశుభ్రతకు సహకరించాలి

ప్రజాశక్తి-మండపేట

పట్టణ పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గ రాణి అన్నారు. బుధవారం స్థానిక 24వ వార్డులో పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వర్షాకాలాన్ని దష్టిలో ఉంచుకుని ప్రజలంతా పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పారిశుధ్య నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఇంటికి వచ్చే పారిశుధ్య కార్మికులకు చెత్తనందించి సహకరించాలన్నారు. అనంతరం స్థానికలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు పాల్గొన్నారు.

జయశ్యామ్‌కు ఎంఎల్‌ఎ చిర్ల అభినందన

ప్రజాశక్తి-కొత్తపేట

10వ తరగతి పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరచి 561 మార్కులు సాధించి విద్యార్థి శ్యామ్‌ను ఎంఎల్‌ఎ చిర్ల జగ్గిరెడ్డి అభినందించారు. కొత్తపేట శ్రీనివాస నగర్‌కు చెందిన నెల్లి రవివర్మ, నాగజ్యోతి కుమారుడు నెల్లి జయశ్యామ్‌కు చిర్ల స్వగహంలో బుధవారం జగనన్న ఆణిముత్యాలు అవార్డు మరియు మెడల్ అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఎం.హరిప్రసాద్ పాల్గొన్నారు

మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

ప్రజాశక్తి-కాట్రేనికోన

మత్స్యకార మహిళల ఆర్థికాభివద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మత్స్యశాఖాధికారి షేక్ లాల్ మహమ్మద్ పేర్కొన్నారు. పల్లంకుర్రు పంచాయతి శివారు మొల్లేటిమొగ తుపాన షెల్టర్ భవనంలో యుఎన్‌డిపి సహకారంతో మత్స్య శాఖ, అటవీ శాఖ ఆధ్వర్యంలో తీరప్రాంత గ్రామ ప్రజలకు కమ్యూనిటీల వాతావరణ మార్పులు, వాటి స్థితిగతులను పెంపొందించడం అనే అంశంలో మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణకు హాజరైన వారందరికీ సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు. ఎఫ్‌డిఒ కె.రామకష్ణ, బివిసి ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్ బి.వెంకట రమణ, అధ్యాపకులు ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్యామ్ కుటుంబానికి న్యాయం చేస్తాం

ప్రజాశక్తి-కొత్తపేట

అనుమానాస్పద స్థితిలో మతి చెందిన ఎన్టీఆర్ అభిమాని మేడిశెట్టి శ్యామ్ మణికంఠ తల్లిదండ్రులతో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మాట్లాడారు. కొత్తపేటలో బుధవారం టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, అమలాపురం టిడిపి ఇన్చార్జి హరీష్ మాధుర్ చంద్రబాబుతో ఫోన్లో మాట్లాడించారు.

నీట్ ర్యాంకర్‌కు జనసేన అభినందన

ప్రజాశక్తి - ఆలమూరు

నీట్ పరీక్షలలో ఓపెన్ కేటగిరీలో 5423 ర్యాంక్ సాధించిన చొప్పెల్లకు చెందిన కోలాటి ఆశ్రితను జనసేన ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాసరావు బుధవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో సూరపురెడ్డి సత్య, సోము గంగాధరం, ఎంపిటిసి జాంపోలు నాగేశ్వరరావు, నాయకులు నాగిరెడ్డి మహేష్, సోము పోతురాజు, దంగేటి సత్యనారాయణ, తోరాటి వెంకన్న, పళ్ళ శ్రీను, వుండమట్ల బాలాజీ, పడాల అమ్మిరాజు, కొత్తపల్లి శివ, అన్యం బంటి, పళ్ళ సాయి, ఆన్యం దుర్గయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పథకాలపై కలెక్టర్ సమీక్ష సమావేశం

ప్రజాశక్తి-అమలాపురం

వివిధ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు, ప్రభుత్వ రంగ సర్వీసులు క్షేత్ర స్థాయిలో అందించడంలో జిల్లా స్థాయి అధికారులకు మండల స్థాయి అధికారులు పూర్తి సమన్వయం, భాగస్వామ్యం వహించి నిర్దేశిత లక్ష్యాలు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ సమావేశపు హాల్లో జిల్లాస్థాయి అధికారులు మండల ప్రజా పరిషత్ అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాలో అమలవుతున్న నవరత్నాలు పేదలందరికీ ఇల్లు డ్వాక్రా రుణాలు, స్త్రీనిధి రుణాల కల్పన రుణ రికవరీ పర్యవేక్షణ వ్యవస్థ బలోపేతం, రుణ రికవరీ విషయంలో సక్రమంగా చెల్లింపులు చేస్తున్నదీ లేనిదీ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ, గడపగడపకు మన ప్రభుత్వం ,ఉద్యాన శాఖ ద్వారా రైతు ఉత్పత్తుల సంఘాలకు కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమల యూని ట్లు రాయితీపై మంజూరు వంటి వాటిపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయి అధికారుల పర్యవేక్షణలో గ్రామ స్థాయిలో పౌర సేవలు అందించడంలో వాలంటీర్ వ్యవస్థ చాలా కీలకమైనదన్నారు. గ్రామ స్వరాజ్య స్థాపన దిశగా ఆవిర్భవించిన గ్రామ వార్డు సచివాలయాలు కూడా పౌర సేవలం దించడంలో కీలకంగా మారాయన్నారు. జిల్లాలో కొబ్బరి విలువ ఆధారిత యూనిట్లు రాయితీపై అందించి స్థానిక ప్రజానీకానికి ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఉద్యాన జిల్లా పరిశ్రమల కేంద్రం జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ అధికారులు కీలకంగా వ్యవహరించాలని ఆదేశించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించి కొబ్బరి ఆదారిత పరిశ్రమలు నెలకొల్పే దిశగా చేయూతనందించాలన్నారు. కొబ్బరి చెట్టు కల్పతరువు వంటిదని, కొబ్బరి ముడి సరుకు ఆధారంగా తయారయ్యే ప్రతి ఉత్పత్తీ విలువైనదేనన్నారు. ఆ దిశగా పరిశ్రమలు నెలకొల్పే విధంగా ప్రభుత్వ పథకాలను జోడించి రాయితీపై యూనిట్లు గ్రౌండ్ చేయాలని ఆదేశించారు. వర్జిన్ కోకోనట్ ఆయిల్, యాక్టివేటెడ్ కార్బన్ తయారీ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ ఉత్పత్తులకు నేటి మార్కెట్లో మంచి గిరాకీ, డిమాండ్ ఉందని ఆయన స్పష్టం చేశారు. తొలి దశలో ఒక్కొక్క మండలంలో ఒక్కొక్క కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చొరవ చూపాలని వాటిని చూసి మరో పదిమంది ఆకర్షితులై ఆయా యూనిట్లు నెలకొల్పుకునేందుకు ముందుకు వచ్చే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. దేశ ప్రధానమంత్రి ఒక్కో జిల్లాలో ఒక్కొ క్క రకమైన ఉత్పత్తి ఉండాలని సూచించారని తెలిపారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - ఆలమూరు

ఖండ్రికపేట ఎంపిపి పాఠశాలలో విద్యార్థులకు రావాడ నరేష్ సుమారు రూ.10 వేల నోట్ బుక్స్, పలకలు, పెన్సిల్లు, పెన్నులు తదితర సామగ్రిని అందజేశారు. ఎంఇఒ డి.మురళీ సత్యనారాయణ బుధవారం వీటిని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ నరేష్ ఈ విధంగా విద్యార్థులందరికీ సామగ్రిని పంపిణీ చేయడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలని అభినందించారు. యుటిఎఫ్ మండల అధ్యక్షుడు, హెచ్‌ఎం అద్దరి శ్రీనివాసరావు మాట్లాడుతూ నరేష్ ఏటా విద్యార్థులకు ఈవిధంగా ఉచితంగా నోట్ బుక్స్ అందజేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఉత్తమ సేవలు చేస్తూ వారు ఉన్నత స్థితిలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ దుర్గ, సిఆర్‌పి జ్యోతి, ఉపాధ్యాయులు రాంబాబు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతు బజార్‌లో ధరల పట్టిక ఉండాలి

ప్రజాశక్తి - ఆలమూరు

రైతు బజార్లో కూరగాయల ధరల పట్టిక వినియోగదారులకు నిత్యం అందుబాటులో ఉండాలని తహశీల్దారు ఐ.పి.శెట్టి ఆదేశించారు. ఇటీవల వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా రూ.20 లక్షలతో మండల కేంద్రంలో నిర్మించి, ప్రారంభించిన రైతు బజార్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ముందుగా ఇన్‌ఛార్జి ఎస్టేట్ అధికారి జి.సుబ్రమణ్యం రైతు బజార్లో ఏర్పాటు చేసిన కూరగాయల ధరల సూచిక పట్టికను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్లో కూరగాయలు విక్రయించే వారు కొనుగోలుదారులకు తాజా కూరగాయలతో పాటుగా ప్రభుత్వం నిర్ణయించే ధరలతో కూరగాయలు అందించే విధంగా ఎస్టేట్ అధికారి చర్యలు చేపట్టాలన్నారు. లోటుపాటలు లేకుండా పంచాయతీ కార్మికులతో ప్రతిరోజు శానిటేషన్ చేయించాలన్నారు.

బాధిత కుటుంబానికి బీమా సొమ్ము అందజేత

ప్రజాశక్తి-మండపేట

ఇటీవల అనారోగ్యంతో మరణించిన అత్తిలి నరేష్ కుటుంబాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి బుధవారం పరామర్శించారు. అతని కుటుంబ సభ్యులకు వైస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేల నగదును అందజేసారు. మిగిలిన సొమ్ము నేరుగా నామినీ బ్యాంక్ అకౌంట్ జమ అవుతుందని తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకుంటామని రాణి అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, కాలనీ గృహ సారథులు పాల్గొన్నారు.

మరణించిన వారి పేర రేషన్

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని పాలతోడు గ్రామానికి చెందిన రేలంగి సూర్యారావు సంవత్సరం క్రితమే మరణించగా అతని భార్య నాగరత్నం అంతకుముందే మృతి చెందింది. వారు మరణించినప్పటికీ నేటి వరకు వారి రేషన్ సరుకులను కొందరు కుమ్మక్కై తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు స్పందనలో కలెక్టర్‌కు, తహశీల్దారుకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

వెంకన్న హుండీల ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి ఉండి ఆదాయాన్ని బుధవారం ఇఒలు ఎన్‌విఎన్‌ఎస్‌వి.ప్రసాద్ రాజు, ఎం.రాధాకష్ణ పర్యవేక్షణలో లెక్కించారు. 34 రోజులకు గాను రూ.66 లక్షలు 30 వేలు, 82 గ్రాముల బంగారం, 481 గ్రాముల వెండి సమకూరింది. విశ్వేశ్వర స్వామి వారి హుండీ ఆదాయం రూ.లక్షా 41 వేల ఆదాయం సమకూరింది. వివిధ దేశాలకు సంబంధించిన కరెన్సీ నోట్లు వచ్చాయి. ఈ లెక్కింపు కార్యక్రమంలో చైర్మన్ రుద్ర రాజు రమేష్ రాజు, ఇఒ ముదునూరి సత్యనారాయణ రాజు, సర్పంచ్ పోచిరాజు బాబూరావు, శనగల సత్యనారాయణ, మెర్ల వెంకటేశ్వరరావు, మన్యం భాను, ఏపుగంటి కనకారావు, రొట్టె రాజేశ్వరి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

430 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - గోపాలపురం

అక్రమంగా నిల్వ చేసిన 430 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. గోపవరం గ్రామానికి చెందిన బొర్ర గోపాలకష్ణ అక్రమంగా మద్యం బాటిళ్లు కలిగి ఉన్నాడని పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ఎస్ఐ పోలీసు సిబ్బందితో దాడి చేశారు. పోలీసుల రాకను పిగట్టిన వ్యక్తి మద్యం బాటిళ్లు వదిలిపెట్టి పారిపోయాడు. అన్ని అరెస్టు చేసినట్లు తెలిపారు. మద్యం బాటిళ్ల విలువ రూ.67,290 ఉంటుందని తెలిపారు. నిందితుని కొవ్వూరు కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కాలువలో పడి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - కొత్తపేట

ప్రమాదవశాత్తు కాలువలో పడి వృద్ధుడు మతి చెందినట్లు కొత్తపేట అదనపు ఎస్ఐ డి.శశాంక తెలిపారు. కొత్తపేట స్థానిక సంతోష్ నగర్‌కు చెందిన చోడపనీడి గోవిందరావు(68) కేదార్లంకలో పూల సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పూలను పాత బస్టాండ్ సెంటర్‌లో పూల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఎప్పటిలానే బుధవారం ఉదయం పూల తోటకు వెళ్లాడు. బోడిపాలెం వంతెన సమీపంలో రావులపాలెం- ముక్తేశ్వరం ప్రధాన పంట కాలువ రేవులో స్నానానికి దిగాడు. ప్రమాదవశాత్తు మునిగి చనిపోయాడు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మతుడి భార్య నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

గంజాయి నిందితులతో పోలీసులు

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - యానాం

యానాంలో గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరు యువకులను అరెస్టు చేశామని సిఐ షణ్ముగం తెలిపారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. స్థానిక ఫెర్రీ రోడ్ కెవిఆర్.నగర్‌కు చెందిన పెమ్మాడి శ్యామలకుమార్, జిఎంసి బాలయోగి నగర్‌కు చెందిన నాటి రాజేష్ యానాంలో గంజాయి విక్రయిస్తున్నట్టు సమాచారం అందిందన్నారు. ఎస్‌పి ఆదేశాల మేరకు క్రైమ్ టీం వీరిని అదుపులోకి తీసుకుందన్నారు. వారి నుంచి 750 గ్రాముల గంజాయి, రూ.450 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ నూకరాజు, క్రైమ్ టీం బృందం పెద్దిరెడ్డి సతీష్, జాంటీ, మల్లాడి గణేష్‌లను సిఐ అభినందించారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న బైకులు

బైకుల చోరీ ముఠా అరెస్టు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

చెడువ్యసనాలకు బానిసై బైకులను చోరీ చేస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్టు చేశారని ఎస్‌పి సతీష్‌కుమార్ తెలిపారు. బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. ముఠా నుంచి రూ.20.70 లక్షల విలువ చేసే 41 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ బైకులు కొనుగోలు చేసిన 9 మందిపై కూడా కేసులు నమోదు చేశామన్నారు. ప్రత్తిపాడు మండలం ప్రత్తి పాడుకు చెందిన కోమరిశెట్టి వీరబాబు, గండేపల్లి మండలం బొర్రపాలేనికి చెందిన ఎస్.రాజు, ఉప్పాడ కొత్తపల్లికి చెందిన పట్నాల సాయివెంకట్, యు.కొత్తపల్లికి చెందిన దొప్ప దుర్గా ప్రసాద్, ఆదిత్యలను అరెస్టు చేశామన్నారు. ఎస్‌పి వెంట అడిషనల్ ఎస్‌పి పి.శ్రీనివాస్, సిఐలు, ఎస్ఐలు ఉన్నారు.

22 ప్యాకేజీ డ్రింకింగ్ వాటర్ యూనిట్ల మూత

అధికారులను ఆదేశించిన కలెక్టర్ కృతికాశుక్లా

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బిఐఎస్)ను పాటించని22 ప్యాకేజ్ డ్రింకింగ్ వాటర్ యూనిట్స్‌ను మూసివేయాలని కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. పరిశ్రమలు, ఎపిఐఐసి, గ్రౌండ్ వాటర్, రవాణా, అగ్నిమాపక, పంచాయతీ, ఫ్యాక్టరీస్, పొల్యూషన్, ఫుడ్ కంట్రోల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. తొలుత గత సమావేశంలో తీర్మానించిన అంశాలకు సంబంధించి తీసుకున్న చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. కాకినాడ జిల్లాలో పరిశ్రమల్లో భద్రత ప్రమణాలు పటిష్ఠంగా అమలయ్యేల పర్యవేక్షణ చేయాలన్నారు. బిఐఎస్ నిబంధనలు పాటించని 22 ప్యాకేజ్ డ్రింకింగ్ వాటర్ యూనిట్స్‌ను మూయించాలన్నారు. సంబంధిత యూనిట్ల యజమానులకు గతంలోనే నోటీసులు జారీ చేశామని తెలిపారు. ప్యాకేజ్ డ్రింకింగ్ వాటర్ యూనిట్స్ ను నిర్వహించేవారు తప్పనిసరిగా గ్రౌండ్ వాటర్ శాఖ అనుమతులు తీసుకోవాలన్నారు. పరిశ్రమల్లో భద్రతతో పాటు పారిశ్రామిక కార్యకలాపాల వల్ల పర్యావరణం కలుషితం కాకుండా దృష్టి సారించాలన్నారు. పారిశ్రామిక యూనిట్లకు సత్వర అనుమతుల జారీకి అమల్లో ఉన్న ఎపి సింగిల్ డెస్క్ విధానం కింద 2023 మే 25 నుంచి జూన్ 26 వరకు మొత్తం 31 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో 18 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేశామన్నారు. రెండు దరఖాస్తులను తిరస్కరించగా, 11 దరఖాస్తులను ఎస్ఎల్ఎ గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఇ) పరిశ్రమలకు సంబంధించి పారిశ్రామిక అభివద్ధి విధానాలు, వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాసం పథకం పరిధిలో 33 యూనిట్లకు వివిధ ప్రోత్సాహకాల కింద రూ.3.46 కోట్లు మంజూరు చేశామన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం టి.మురళి, ఎడి కె.కృష్ణారావు, పరిశ్రమల డిప్యూటీ ఛీఫ్ ఇన్‌స్పెక్టర్ డి.రాధాకష్ణ, ట్రాన్స్‌పోర్టు అధికారి పి.సాయిప్రసాద్, అగ్నిమాపక అధికారి సురేంద్ర ఆనంద్, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ అధికారి బి.శ్రీనివాసు తదితరులు హాజరయ్యారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికాశుక్లా

పూడుకుపోయిన పంట కాలువ

సాగునీటి సరఫరాకు అవరోధంగా గుర్రపుడెక్క

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలంలో సాగునీరు అందించే గోదావరి కాలువలు గుర్రపు డెక్కతో నిండుకుని ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని హుస్సేన్ పురం, సత్యవరపు పేట వంతెన వద్ద గోదావరి కాలువలో సుమారు మూడు కిలోమీటర్ల మేర నీటి ప్రవాహం లేక సామర్లకోట దిగువన వరి పొలాలకు సాగునీటి కొరత ఏర్పడింది. ఇప్పటికే 27 రోజులుగా ఖరీఫ్ వరి సాగు జాప్యం అయ్యిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమయంలో సామర్లకోట పట్టణ, మండల పరిధి రైతులలోతో పాటు, 42 వేల ఎకరాలకు సాగు నీరందించే పిబిసి కెనాల్‌కు సైతం ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు వాపోతున్నారు. గుర్రపు డెక్క అవరోధాలు కారణంగా వేట్లపాలెం నుంచి సరప్లయిస్ ద్వారా మురుగు కాలువలోకి గోదావరి జలాలు వృథాగా పోతున్నాయని రైతులు చెబుతున్నారు. అధికారులు స్పందించి పూడిక తీత పనులు చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.

పోషకాహారంతోనే మెరుగైన ఆరోగ్యం

ప్రజాశక్తి - కాజులూరు

సంపూర్ణ పోషకాహారంతోనే గర్భిణులకు, బాలింతలకు మెరగైన ఆరోగ్యం ఉంటుందని సిడిపిఒ మాధవి అన్నారు. బుధవారం వైఎస్ఆర్ సంపూర్ణ పోషణపై చీకట్లవారి పేట అంగన్‌వాడీ కేంద్రం వద్ద సర్పంచ్ పి.ప్రసన్నమౌనిక అధ్యక్షతన, కాజులూరు అంగన్‌వాడీ కేంద్రం వద్ద సర్పంచ్ దండంగే సరోజిని అధ్యక్షతన అవగాహనా సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా గొల్లపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ కెవి.రమణకుమారి మాట్లాడుతూ, గర్భిణి, బాలింతల్లో పోషకాహార లోపం, రక్తహీనత రాకుండా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. సంపూర్ణ పోషణ కిట్లను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నేరుగా లబ్ధిదారులకే అందిస్తామన్నారు. తాళ్లరేవు ఎన్ఎన్ఎం బ్లాక్ కో-ఆర్డినేటర్ డి.శ్రీనిబాబు మాట్లాడుతూ ప్రాజెక్ట్ పరిధిలో ఆరోగ్య శాఖ సిబ్బంది, అంగన్‌వాడీలు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పోషకాహారం, ఆరోగ్యంపైన అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాజులూరు సూపర్‌వైజర్ మాణిక్యాంబ, అంగన్‌వాడీలు ఎ.నాగమణి, టి.వరలక్ష్మి, హనుమావతి తదితరులు పాల్గొన్నారు.

బాల సదనంలో జడ్జి ప్రత్యూషకుమారి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ కె.ప్రత్యూష కుమారి, ప్రకాష్ నగర్‌లోని కెవి.స్టేట్ హోమ్, బాల సదనాన్ని బుధవారం సందర్శించారు. సంక్షేమ వసతి గృహాల్లో వసతులను పరిశీలించారు. వసతి గహ వాసులతో మాట్లాడారు. అక్కడ వారికి అందుతున్న సదుపాయాల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. శ్రద్ధగా చదువుకుని క్రమశిక్షణతో ఉండాలని అన్నారు. పిల్లల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని వసతి గహ సిబ్బందితో చెప్పారు.

ఉత్తమ పౌరులుగా ఎదగాలి

ప్రజాశక్తి - కాకినాడ

ప్రతి విద్యార్థీ ఉత్తమ పౌరునిగా ఎదగాలని కాకినాడ మండల విద్యాశాఖాధికారి-2 చెవ్వూరి రవి అన్నారు. స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెంటాన్స్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం సీడ్ కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా రవి హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ, మానవతా విలువలు కలిగి ఉండాలన్నారు. ఒత్తిడి లేకుండా చదవాలని పిలుపునిచ్చారు. స్పందన ఈద ఫౌండేషన్ సేవలు అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి తోటకూర సాయిరామకృష్ణ మాట్లాడారు. స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ సామ్యూల్‌రెడ్డి ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ మాట్లడుతు ప్రతి విద్యార్థి నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికి టైమ్ మేనేజ్ మెంట్, పట్టుదల, శ్రద్ధ అవసరమన్నారు. హెచ్ఎం నిర్మలా కుమారి మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ ఉత్తమ లక్షణాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కాకినాడ జిల్లా కార్యదర్శి కేసరి శ్రీనివాస రావు మాట్లాడుతూ ఉత్తమ విద్యార్థులను తయారు చేయడం సంస్థ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రవి

యానాం వార్తలు

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దేవదానం తదితరులు

'శతక రత్నావళి' పుస్తకావిష్కరణ

స్థానిక మెట్టకూరు రీజెన్సీ పబ్లిక్ స్కూల్లో శతక రత్నావళి పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో మానవీయత, నైతిక విలువలు, పాఠశాల దశ నుంచే బోధించాలనే సంకల్పంతో రీజెన్సీ విద్యాసంస్థల అధినేత డాక్టర్ జిఎన్.నాయుడు సూచనల మేరకు రీజెన్సీ పాఠశాల హెచ్ఎం ఉపాధ్యాయ బందంతో కలిసి ప్రసిద్ధ కవుల నుంచి సాహిత్య రచనలు, ఉత్తమ పద్యాలు, శ్లోకాలు, కథలను సేకరించి "శతక రత్నావళి" అనే పుస్తకాన్ని రూపొందించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రముఖ కవి, కాలైమామని అవార్డు గ్రహీత దాట్ల దేవదానం రాజు చేతుల మీదుగా ఈ పుస్తకావిష్కరణ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నైతిక విలువలు, వాటితో పాటు తెలుగు భాష గొప్పదనం, సాహిత్యం పట్ల మక్కువ ఎలా అలవర్చుకోవాలనే విషయాలను వివరించారు. అనంతరం విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణప్రవీణ్, ఎస్ఆర్‌కె ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ వరుగు భాస్కర్‌రెడ్డి, ముమ్మిడి నాగప్రసాద్, హెచ్ఎం టివిఎస్ఎస్‌వి.ప్రసాదరావు, ప్రిన్సిపల్ పిఎం.ప్రసాద్, ఇన్‌ఛార్జి చెక్కల వీరభద్రరావు, వై.శ్రీనివాసరావు మాట్లాడారు. అనంతరం ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బి.ఉషాకుమారి, ఆర్.రాధారాణి, పుష్పకుమారి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజ్యసభ సభ్యుడు సెల్వగణపతి రాక

పుదుచ్చేరిలోని ఏకైక రాజ్యసభ సభ్యుడు సెల్వగణపతి ఈ నెల 29న గురువారం యానాంలో పర్యటించనున్నారు. బిజెపి తొమ్మిదేళ్ల పాలనపై ఇంటింటికీ వెళ్లి ప్రజల అభిప్రాయాలను తెలుసుకోనున్నారు.అదేవిధంగా వివిధ ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనున్నారు.

భూసేకరణ వేగవంతానికి ఆదేశం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

వాకలపూడి నుంచి రాజానగరం వరకు విస్తరించనున్న ఎడిబి రోడ్డు నిర్మాణానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్‌డిఒ ఎన్‌వివి.సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. బుధవారం కాకినాడ ఆర్‌డిఒ కార్యాలయంలో తహశీల్దార్లు, విఆర్ఒలు, సర్వేయర్లు తదితరులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడారు. ఎడిబి రోడ్డు విస్తరణకు సంబంధించి కాకినాడ రూరల్ మండలంలో తిమ్మాపురం, రమణయ్యపేట, సామర్లకోట మండలంలో భీమవరం, జగ్గమ్మ గారి పేట, పనసపాడు, వల్లూరు గ్రామాల్లో భూ సేకరణను వేగవంతం చేయాలన్నారు. భూసేకరణకు సంబంధించి రైతుల నుంచి వచ్చిన క్లెయిమ్స్‌ను విచారణ చేసి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ఎడిబి రోడ్డు విస్తరణకు సుమారు 81 ఎకరాలు మేర భూమి అవసరమన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్లు వి.మురార్జీ, ఎస్ఎల్ఎన్.కుమారి, పరిపాలన అధికారి వరహాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ సత్యనారాయణ

రూ 16.57 కోట్లు అమ్మఒడి నిధుల విడుదల

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలంలో అమ్మ ఒడి పథకం లబ్ధిదారులకు రూ.16,57,35,000 విడుదలయ్యాయని ఎంఇఒ సిహెచ్.సత్యనారాయణ తెలిపారు. 11,049 మందికి ఒక్కొక్కరికి రూ.13 వేలు చొప్పున, టాయిలెట్ మెయింటినెన్స్ ఫండ్‌గా రూ.2వేలు విడుదలయ్యాయన్నారు. మండలంలోని 36 సచివాలయాల పరిధిలో ఉన్న లబ్ధిదారులందరికీ అమ్మ ఒడి మంజూరైందన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐ

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన ఉండాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి పి.విజయ్‌భాస్కర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక వై.జంక్షన్ వద్ద గల రైతు బజార్‌లో కన్స్యూమర్ వాయిస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో విజయ్ భాస్కర్ మాట్లాడారు. రైతు బజార్లలో నాణ్యమైన కూరగాయలు, నిత్యావసర సరుకులు చౌకగా లభిస్తాయన్నారు. ఏవైనా ఫిర్యాదులు ఉంటే చర్యలు చేపడతామన్నారు. వినియోగదారుల హక్కులు, ఫిర్యాదులు ఏవిధంగా చేయాలో వివరించారు. వినియోగదారులతో నేరుగా చర్చించి సమస్యలు పరిష్కరించారు. జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వినియోగదారుల రక్షణ మండలి సభ్యులు గొట్టిముక్కల అనంతరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.సునీల్ వినయ్, లీగల్ మెట్రాలజి ఇన్‌స్పెక్టర్ శివ బాలాజీ ఎలక్ట్రానిక్ కాటాలను తనిఖీ చేసి రైతులకు పలు సూచనలు చేశారు. ఎస్టేట్ ఆఫీసర్ రోజియా, కన్స్యూమర్ వాయిస్ సభ్యులు మొగ్గ శ్రీను, ఐ.చందు, విజయ్ రాజు, రైతులు, వినియోగదారులు పాల్గొన్నారు.

కొండావారి పేటలో 'వారధి'

ప్రజాశక్తి - కోటనందూరు

తుని పట్టణంలోని కొండ వారి పేటలో సిఐ ఎం.నాగదుర్గారావు ఆధ్వర్యంలో వారధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల జరిగే నష్టాలు, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. యువత సంఘ విద్రోహ కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కొండవారి పేట ప్రజా ప్రతినిధులు, కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

12,044 మందికి అమ్మఒడి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలంలో 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి 12,044 మంది తల్లులకు రూ.18,06,60,000 మంజూరయ్యాయని ఎంఇఒ వై.శివరామకీష్ణయ్య తెలిపారు. ఇకెవైసి పూర్తిగా జరగనందున బుధవారం సామర్లకోట మండల పరిధిలో తల్లుల ఖాతాలకు అమ్మఒడి నగదు జమకాలేదని సమాచారం. సచివాలయాల పరిధిలో ఇంకా ఇకెవైసి ప్రక్రియను కొనసాగిస్తున్నారు. మరో రెండు రోజులపాటు ఈ ప్రక్రియ కొనసాగే అవకాశం ఉన్నట్లు సమాచారం.

మహారాజశ్రీ 7వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

O.S. No. 32/2021

Between:
Komarthi Suryanarayana ...*Plaintiff*
AND
Mortha Naga Mani and Others ...*Defendants*

D-2: Mortha Latha, D/o. late Moshe, Hindu, aged about 30 years, D.No. 19-2-1/179, Vambe Apartment, C/19, Opposite Church, Ademmadibba, Rajamahendravaram, East Godavari District, RJCJ.

పై నెంబరు దావాలో 2వ ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 21-7-2023 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి **కె.జగదీష్‌కుమార్**
27-6-2023 అడ్వకేట్, రాజమండ్రి

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టు : కాకినాడ

Succession O.P. No. 9/2023

Between:
మద్దూరి నాగమణి ...పిటీషనరు
మరియు
1) ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (మినిస్ట్రీ ఆఫ్ లేబర్ గవర్నమెంటు ఆఫ్ ఇండియా) రాజమండ్రి.
2) అలజింగి దుర్గా ప్రసాద్
3) అలజింగి లలిత
4) అలజింగి నీరజ్
5) అలజింగి జననీ ...రెస్పాండెంట్లు

పై నెంబరు గల కేసులో S.O.P. 9/2023 పిటీషనరు వారసురాలిగా చనిపోయిన అలజింగి మంగ భర్త నూకరాజు (లేటు) అను ఆమెకు పైన పేర్కొన్న పిటీషనరు మాత్రమే ముఖ్యవారసురాలిగా అయ్యి ఉన్నారని, అందుచేత పై నెంబరు గల కేసులో ఎవ్వరికైన ఎటువంటి అభ్యంతరములు ఉన్ననూ **ది. 17-07-2023 సం॥రం తేదీని ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు స్వయంగా గానీ, మీ వకీలు ద్వారా గానీ పైన పేర్కొన్న కోర్టు నందు హాజరై మీ అభ్యంతరములు తెలుపవలెను. లేని యెడల శ్రీ కోర్టువారు రికార్డు ప్రకారము పిటీషనరును మాత్రమే ముఖ్యవారసురాలిగా నిర్ధారించగలరు. ఈ ప్రకటన శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము జారీ చేయడమైనది.

ముడుగు రాజేంద్రబాబు, B.A., L.L.B., అడ్వకేట్
డో.నెం. 1-240, 3వ వీధి, స్వామినగర్, వార్డు నెం. 42, కాకినాడ.
కాకినాడ
తేది: 28-06-2023 సెల్: 79810 19361

జగనన్న సురక్షను వినియోగించుకోవాలి

పెద్దాపురం : 11 రకాల సేవలను ప్రజలకు ఉచితంగా అందించే జగనన్న సురక్ష పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక 9,10,11,12 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష పథకంపై వాలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, వైస్ ఛైర్మన్ కె.మహాలక్ష్మి, మున్సిపల్ కౌన్సిలర్లు ముప్పన శ్యామలాంబ, కట్టా రాజబాబు, కౌన్సిల్ కో-ఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ, వైసిపి నాయకులు ముప్పన వీర్రాజు, నీలం పండు, చింతా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రక్కిలంలో ప్రయివేటు బ్యాంకు సేవలు

తాళ్లపూడి : రైతులతో పాటు మారుమూల గ్రామాల ప్రజలకు సైతం తమ బ్యాంకు సేవలు అందించడమే లక్ష్యంగా పల్లె టూర్లలో సిఎస్‌బి శాఖలు ప్రారంభిస్తున్నామని ఆ బ్యాంకు మేనేజర్ ప్రసాద్ అన్నారు. జిల్లాలో 20వ శాఖను ప్రక్కిలంక డాక్టర్ జెవి కష్ణారావు కాంప్లెక్స్‌లో పారిశ్రామికవేత్త సింహాద్రి జనార్దన రావు బుధవారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ యాళ్ల స్వప్న, వైసిపి నాయకులు యాళ్ల బాబూరావు బ్యాంకులో వివిధ విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ తమ బ్యాంకు ద్వారా మిగతా బ్యాంకుల కంటే తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తామని, డిపాజిట్లపై అధిక శాతం వడ్డీ ఇస్తామని చెప్పారు.

బదిలీ చేయాలని స్కూల్ స్వీపర్ల వినతి

నిడదవోలు : గత 33 సంవత్సరాలుగా మున్సిపల్ స్కూల్ స్వీపర్లుగా పని చేస్తున్న తమను విద్యా శాఖకు బదిలీ చేయాల్సిందిగా కోరుతూ స్కూల్ స్వీపర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కె.పద్మావతికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ జిఒ 84ను అనుసరించి నిడదవోలు పురపాలక సంఘంలో 1987 నుంచి పార్ట్ టైం కంటింజెంట్ స్వీపర్లు దళసరి అంజమ్మ, పార్వతి, బడుగు పద్మావతి మరో ఇద్దరు పని చేస్తున్నారు. వెంటనే స్పందించి విద్యా శాఖకు బదిలీ చెయ్యాలని, అప్పటి వరకు జీతాలు చెల్లించాలని రాంబాబు కమీషనర్‌ను కోరారు. వెంటనే కౌన్సిల్ తీర్మానం చేస్తామని ఛైర్‌పర్సన్ ఆదినారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ నాయకులు గారపాటి ప్రసన్న కష్ణ తదితరులు పాల్గొన్నారు.

దళిత వాడల్లో మంచినీటి కోసం పాట్లు

ప్రజాశక్తి - సీతానగరం

రాపాక గ్రామపంచాయతీ పరిధిలోని కొన్ని రోజులుగా మంచినీటి కుళాయిల నుంచి వాటర్ రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు కానీ పంచాయతీ నాయకులు గానీ స్పందించిన దాఖలాలు లేవని గ్రామ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఏది ఏమైనా రాపాక గ్రామపంచాయతీలో మంచినీటి సరఫరా విషయంలో సర్పంచ్ తీరుపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల అధికారులు గానీ పంచాయతీ అధికారులు కానీ గ్రామ ప్రజల సమస్యలను పట్టించుకున్న దాఖలాలు లేవని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంక్షేమ పథకాలు ఎన్ని అమలు అవుతున్నా దళిత వాడల్లో అరకొర సదుపాయాలతో విడుదలయ్యే మంచినీరు మురికి నీరుగానే వస్తున్నాయని పలువురు వాపోతున్నారు. పంచాయతీ అధికారుల దృష్టికి వెళ్లినా స్పందించిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి ప్రధాన సమస్యలు ఏమిటో తెలుసుకుని ప్రజలకు కావలసిన మంచినీటి సదుపాయాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మహిళా జర్నలిస్టుపై వేధింపులు ఆపివేయాలి

ప్రజాశక్తి-నిడదవోలు

బిజెపి విధానాలను సామాజిక మాధ్యమాల ద్వారా ఎండ కడుతున్న స్వతంత్ర మహిళా జర్నలిస్టు తులసి చందుపై వేధింపులను అందరూ తీవ్రంగా ఖండించాలని సిపిఎం జిల్లా నాయకులు జువ్వల రాంబాబు కోరారు. బుధవారం పట్టణంలోని డివైఎఫ్ కార్యాలయంలో జర్నలిస్టులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ తులసి చందును కాపాడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన గత ఎనిమిదేళ్ల కాలంలో కవులను, రచయితలను, ప్రజాస్వామ్య వాదులను హతమార్చారని గౌరీ లంకేష్, గోవింద్ పన్సారే ఇలాంటివారిని భౌతికంగా లేకుండా చేశారని భవిష్యత్తులో అనేక మందిని కూడా హతమార్చేందుకు సిద్ధంగా ఉన్నారని విషయాన్ని దేశ ప్రజలందరూ గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు భాస్కర్ల రాజా రామ్మోహన్ రాయ్, గంగాధర్, ప్రసన్న కష్ణ, కె.వసంతరాజు, ప్రకాష్, నజీర్, మణికంఠ, రహీం, ఎల్లే రాజు తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక సూచిక బోర్డుల అందజేత

తాళ్లపూడి : వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా ముందుగా హెచ్చరించే సూచిక బోర్డులను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్ఐ కెవి.రమణ అన్నారు. తాళ్లపూడి మండల శివారు చిడిపి మరియు గజ్జరం గ్రామాలలో ప్రమాద భరితంగా ఉన్న మలుపుల వద్ద ఏర్పాటు చేసే విధంగా హెచ్చరికల బోర్డులను మండల మానవత శాఖ బుధవారం తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌కు అప్పగించింది. ఈ కార్యక్రమంలో మానవత శాఖ అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు కార్యదర్శి సాయన సుబ్బారావు రీజనల్ ఛైర్మన్ వి.చంద్రయ్య ఆత్మీయ సహకార కమిటీ సభ్యులు అప్పన చంద్ర ధర గుప్త పోలీస్ శాఖ సిబ్బంది ఉన్నారు.

కూనలమ్మ జాతర ముగింపు

సీతానగరం : కూనవరం గ్రామ దేవత కూనలమ్మ జాతర ముగింపు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఐదు రోజులపాటు నిర్వహించిన జాతర ముగింపు సందర్భంగా ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా, మాజీ ఎంఎల్‌ఎ పెందుర్తి వెంకటేష్, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిరెడ్డి వాసు, కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రకటన

మహారాజశ్రీ పిఠాపురం సీనియర్ సివిల్ వారి కోర్టులో

E.P. 23/2021, O.S. 270/2017

బిట్వీన్:
పోలిశెట్టి నాగశేఖర్ ...*DHR*
అండ్
1. గెడ్డమూరి శివాజీ, S/o. వీరబాబు, 42 సం॥లు, డోర్ నెం. 3-16-8/5, కొమాకులవారి స్ట్రీట్, మారకండరాజుపేట, తుని, Tuni JCJ.
2. గెడ్డమూరి పద్మ, W/o. శివాజీ, 36 సం॥లు, డోర్ నెం. 3-16-8/5, కొమాకులవారి స్ట్రీట్, మారకండరాజుపేట, తుని, Tuni JCJ.
...*JDR's*

పై నెంబర్ దావాలో వాది మీపై షెడ్యూల్ ఆస్తిని వేలం వేయమని E.P. దాఖలు చేసి ఉన్నారు. మీరు నోటీసు అందుకోనందున శ్రీ కోర్టు వారు పేపర్ ద్వారా నోటీసు ఆర్డరు వేసినారు. కావున మీ అభ్యంతరములు **ది. 30-6-2023వ తేదీ ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీ అభ్యంతరములు తెలియచేయవలెను. లేని యెడల మీకు వ్యతిరేకముగా తీర్పు చెప్పబడును.

బత్తిన లక్ష్మణదొర
అడ్వకేట్, పిఠాపురం

ప్రకటన

మహారాజశ్రీ 3వ అదనపు జిల్లా కోర్టు : కాకినాడ
I.A. 523/2020 in A.S.S.R. 1689/2020

Between:
శ్రీమతి కొప్పాడ ఆదిలక్ష్మి...పిటీషనర్ / అప్పిలెంట్
మరియు
పూసర్ల నాగేశ్వరరావు వగైరా ...రెస్పాండెంట్లు

R_7 : **మల్లిడి హైమావతి,** W/o. అమ్మిరెడ్డి, డో.నెం. 4-9-10, కొవ్వూరు రోడ్డు, జగన్నాధపురం, కాకినాడ.
R_8 : **మల్లిడి ధర్మారెడ్డి,** S/o. అమ్మిరెడ్డి, డో.నెం. 4-9-10, కొవ్వూరు రోడ్డు, జగన్నాధపురం, కాకినాడ.
R_9 : **మల్లిడి శైలజారెడ్డి,** D/o. అమ్మిరెడ్డి, డో.నెం. 4-9-10, కొవ్వూరు రోడ్డు, జగన్నాధపురం, కాకినాడ.

పై నెంబరు I.A. No. 523/2020 లో 7, 8, 9 రెస్పాండెంట్లు అయిన మీకు కోర్టు నుండి ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. పై నెంబరు పిటీషన్ **ది. 18-07-2023 నకు** వాయిదా అయివున్నది. కావున 7, 8 మరియు 9వ రెస్పాండెంట్లు అయిన మీరు పై తేదీన పైన తెలిపిన కోర్టులో **ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరు అయి ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేని యెడల పై నెంబరు పిటీషన్ తమ పరోక్షమున తీర్మానం చేయబడును అని ఇందుమూలముగా తెలియపరచడమైనది.

|| By Court Order ||

కాకర వెంకటేశ్వరరావు, అడ్వకేట్
#12-1-40, జవహర్ వీధి, కాకినాడ.
Ph: 0884-2367503, Cell: 9848314081